రెగ్యులర్ ఎంఇగా రాయల్ బాబు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పాలక సంస్థ రెగ్యులర్ మున్సిపల్ ఇంజినీర్ (ఎంఇ)గా టి.రాయల్ బాబు నియమితులయ్యారు. మంగళవారం నుంచి పూర్తి స్థాయి బాధ్యతలు నగర పాలక సంస్థ లో వ్యవహరించనున్నారు. ఇంతకాలం ఎంఇగా ఉంటూ ప్రజారోగ్యశాఖ సూపరెండెంట్ ఇంజినీర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇటీవల కొందరు ఇఇలకు ఉద్యోగోన్నతి కల్పించడంతో.ప్రజారోగ్య శాఖకు రెగ్యులర్ ఎస్ఇ రావడంతో రాయల్ బాబు రిలీవ్ అయ్యారు. రెండు బాధ్యతలు ఉండటంతో కొన్ని రోజుల విశాఖపట్నం, మరి కొన్ని విజయనగరంలో బాధ్యతలు నిర్వహించారు. పూర్తి స్థాయిలో ఎంఇగా నియామకం కావడంతో అభివృద్ధి పనులపై దృష్టి పెట్టనున్నారు.

సచివాలయాల్లో తగ్గనున్న పోస్టులు

తొలిదశలో జనరల్ కేటగిరిలో 2 నుంచి 4 పోస్టులకు ఎసరు
మలిదశలో టెక్నికల్ కేటగిరి
గ్రామ, వార్డు సచివాలయాల కుదింపే లక్ష్యమా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయాల్లో పోస్టులు తగ్గిపోనున్నాయి. సచివాలయాల కుదింపే లక్ష్యంగా రేషనలైజేషన్ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. తొలిదశలో ప్రతి సచివాలయంలోనూ కనీసం 2నుంచి గరిష్టంగా 4పోస్టులకు ప్రభుత్వం ఎసరుపెట్టనుంది. దీంతో మిగతా సిబ్బందిపై పనిభారం పడనుంది. గ్రామ, వార్డు స్థాయిలో పరిపాలన అన్న లక్ష్యం ఆచరణలో ఎలా ఉంటుందో వేచిచూడాల్సిందే.

ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల్లో అడ్మిన్ సెక్రటరీ, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రోసిసింగ్ సెక్రటరీ, ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ సెక్రటరీ, హెల్త్ సెక్రటరీ ఎఎన్ఎం, ఎనర్జీ సెక్రటరీలతోపాటు యానిమల్స్, రెవెన్యూ, వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్, ఉమెన్ ప్రొటక్షన్ (మహిళా పోలీస్) కలుపుకుని మొత్తం 10పోస్టులు ఉన్నాయి. గ్రామ, వార్డు సచివాలయ శాఖ గత నెలలో విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం 2 నుంచి 4పోస్టులు తగ్గనున్నాయి. మలిదశలో మరిన్ని తగ్గే అవకాశాల ఉంటాయని పలువురు విశ్లేషిస్తున్నారు. గ్రామ స్థాయిలో ప్రజలకు సేవలందించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. మన జిల్లాలో 530 గ్రామ సచివాలయాలు, 96 వార్డు సచివాలయాలు కలిపి మొత్తంగా 636 వరకు ఉన్నాయి. దీంతో, చాలా పనుల కోసం తహశీల్దార్, ఎపిడిఒ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. గ్రామ కార్యదర్శులు విఆర్ఒల కోసం ప్రజలు గ్రామంలోని పెత్తందార్లు, లేదా సర్పంచి, మాజీ సర్పంచుల ఇళ్లల్లోని వెతికాల్సిన అవసరమూ తగ్గిపోయింది. మొత్తం పది మంది సిబ్బంది గ్రామ సచివాలయం కేంద్రంగా అందుబాటులో ఉండడంతో సమయం, వ్యయ ప్రయాసలు తగ్గాయి. ఇటువంటి తరుణంలో సచివాలయ సిబ్బంది, ఆ తరువాత సచివాలయాలను తగ్గించే ఆలోచనలో ప్రభుత్వం కనిపిస్తోంది. ఇందులో భాగంగానే తాజా ఉత్వరులు ప్రకారం ప్రస్తుతం ఉన్న సచివాలయాలను ఎ,బి, సి గేటగిరీలుగా విభించించింది. 2,500లోపు జనాభాగల సచివాలయాలను 'ఎ' కేటగిరీ కింద పరిగణించనున్నారు. వీటి పరిధిలోని సచివాలయ అడ్మిన్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రోసెసింగ్ సెక్రటరీ, వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్, మహిళా పోలీస్ పోస్టుల్లో కోత పడనున్నాయి. ఈ విధానం అమల్లోకి వస్తే జనరల్ కేటగిరిలో 2పోస్టులు, టెక్నికల్ కేటగిరిలో 4పోస్టులు చొప్పన మొత్తం 6పోస్టులు మాత్రమే ఉంటాయి. 'బి' కేటరిగిరీలో 3500లోపు జనాభా ఉటుంది. ఇందులో జనరల్-3, టెక్నికల్ -4 చొప్పన మొత్తం 7పోస్టులు ఉంటాయి. 'సి' కేటగిరిలో 351పైబడిన జనాభా ఉంటుంది. ఇందులో జనరల్ 4, టెక్నికల్ 4 చొప్పన మొత్తం 8పోస్టులు ఉంటాయి. ఈలెక్కన మెజార్టీ సచివాలయాల్లో కనీసం 2 నుంచి 4 పోస్టులు తగ్గనున్నాయి.

ఈలెక్కన విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని విటి అగ్రహారం -2, అయ్యన్నపేట -2 సచివాలయాల్లో వార్డు అడ్మిన్ సెక్రటరీ, మహిళా పోలీస్ పోస్టులు రద్దు కానున్నాయి. దత్తిరాజేరు మండలం పాచలవలస సచివాలయం బి-కేటరిగికి చేరనుంది. కేటగిరి ప్రకారం అక్కడ వెల్ఫేర్ అసిస్టెంట్ పోస్టు రద్దు కానుంది. అదే మండలం వి.కృష్ణాపురం, టి.బూర్జవలస, షికారుగంజి, రాజుల రామచంద్రపురంలో కె.కొత్తవలస, మరడాం సచివాలయాల్లో మహిళా పోలీస్ పోస్టులు ఎగిరిపోనున్నాయి. ఇలా దాదాపు ఎక్కువ గ్రామాల్లో పైన పేర్కొన్న పోస్టుల్లో కొన్ని రద్దు కానున్నాయి.

కలెక్టరేట్‌లో అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్, అధికారులు; జిల్లా గ్రంథాలయం వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నివాళులర్పిస్తున్న యువకులు

విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు

ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విప్లవ జ్యోతి అని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ కొనియాడారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ, జాతికి అల్లూరి చేసిన సేవలను కొనియాడారు., అల్లూరి చేసిన స్వాతంత్ర్య పోరాటం ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చిందని అన్నారు. సెట్విజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిపిఒ టి.వెంకటేశ్వరరావు, జెడిఎ విటి రామారావు, సెట్విజ్ సిఇఒ సోమేశ్వరరావు, జిల్లా పర్యాటకాధికారి కుమారస్వామి, సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ రామారావు, డిబిసిడిడబ్ల్యుఒ జ్యోతిశ్రీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎస్‌పి వకుల్ జిందల్ ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధన కోసం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విప్లవ పందాను ఎన్నుకున్నారన్నారు. ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్య పోరాటం కోసం బ్రిటీష్ సామ్రాజ్యమనే మహాశక్తిని ఆయన ఢీ కొన్నారన్నారు. ఆయన చూపిన తెగువ, పట్టుదల మనందరికి ఆదర్శనీయమని, స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ అధికారులు నివాళి

విప్లవ జ్యోతిగా, పోరాట యోధునిగా, మన్యం వీరునిగా అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని నగర మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి,ఘనంగా నివాళులర్పించారు. సహాయ కమిషనర్ సిహెచ్ కె.అప్పలరాజు, మున్సిపల్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగరాజు, ఇతర సిబ్బంది కూడా నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో అంకితభావంతో మరిన్ని సేవలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, మేనేజర్ ప్రసాదరావు, టిపిఆర్ఒ సింహాచలం పాల్గొన్నారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమం

అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా గురజాడ గ్రంథాలయం వద్ద అల్లూరి చిత్రపటానికి డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం సాగించి, తెలుగు వారి పౌరుషాన్ని ప్రపంచానికి చాటిన విప్లవ వీరుడు అని కొనియాడారు. నేటి యువత సమాజంలోని అన్యాయాలను ఎదుర్కోవడానికి ఆయన పోరాట ధోరణిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. 1924 మే7న బ్రిటీష్ సైనికుల తూటాలకు బలి అయిన అల్లూరి త్యాగభావం నేటి యువతకు ప్రేరణనిస్తుందన్నారు.కార్యక్రమంలోని రామ్ శ్రీ, ఆదిత్య యువత పాల్గొన్నారు.

జూ మ్ కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతుమాధవన్

మలేరియా నిర్మూలనకు ఇంటిలోపలే స్ప్రేయింగ్

పిచికారీకి 157 గ్రామాలు ఎంపిక
ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరం

మలేరియా నిర్మూలనకు ఇంటి లోపల గోడలపై ఎసిఎం 5 (ఆల్ఫా సైఫర్ మెత్రిన్) స్ప్రే చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ సూచించారు. దీనికోసం జిల్లా వ్యాప్తంగా 157 గ్రామాలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. వ్యాధి ఎక్కువగా ఉన్న 18 మండలాలకు చెందిన ప్రత్యేకాధికారులు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, వైద్యాధికారులు, మలేరియా సబ్ యూనిట్ అధికారులతో బుధవారం తమ ఛాంబర్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ, మలేరియా వ్యాప్తిని నిరోధించడానికి మొత్తం 22 పిహెచ్‌సిల పరిధిలోని 157 గ్రామాల్లో రెండు విడతలుగా ఎసిఎం మందును పిచికారీ చేయనున్నట్లు తెలిపారు. మే 1 నుంచి జూన్ 15 వరకు మొదటి విడత, జులై 1 నుంచి ఆగస్టు 15 వరకు రెండో విడత ఏసిఎం మందును పిచికారీ చేయనున్నట్లు వెల్లడించారు. అన్ని గదుల్లో గోడలమీద ఈ మందును పిచికారీ చేస్తామన్నారు. ఇలా మందు పిచికారీ చేసినప్పుడు ఆ ఇంటి గోడలపై 10 నుంచి 12 వారాలు వరకు ఆ మందు ప్రభావం ఉంటుందని, ఆ లోగా గోడలను కడగడం గానీ, సున్నం వేయడం గానీ చేయరాదని సూచించారు. అందువల్ల ఈ కార్యక్రమానికి ప్రజలనుంచి సంపూర్ణ సహకారం అవసరమని చెప్పారు. సమావేశంలో జిల్లా కేంద్రం నుంచి డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా మలేరియా అధికారి మణి పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో పారిశ్రామిక పార్కులకు శంకుస్థాపన

9న ఎస్.కోట, నెల్లిమర్ల, 10న గజపతినగరం, బొబ్బిలి నియోజకవర్గాల్లో...
రూ.47.35 కోట్లతో 127.58 ఎకరాల్లో నాలుగు పార్కులకు శ్రీకారం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి బాటలు వేస్తూ చిన్న పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు నాంది పలికింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఒక ఎంఎస్ఎంఇ. పార్కు(వాడ) ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుంది. తొలివిడతలో జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడల ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మే 1వ తేదీన నెల్లూరు జిల్లా నుంచి ఆన్ లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ పార్కులను ఆయా నియోజకవర్గాల పరిధిలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసే ప్రాంతంలో ప్రారంభించే కార్యక్రమానికి ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలతో కలసి రాష్ట్ర చిన్న మధ్యతరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శ్రీకారం చుట్టనున్నారు.

జిల్లాలో తొలివిడతగా ఎస్.కోట, నెల్లిమర్ల, గజపతినగరం, బొబ్బిలి నియోజకవర్గాల్లో 127.58 ఎకరాల్లో రూ.47.35 కోట్ల వ్యయంతో పారిశ్రామిక వాడలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఎపిఐఐసి) ఆధ్వర్యంలో ఈ ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు కానున్నట్టు ఆ సంస్థ జోనల్ మేనేజర్ ఎం.మురళీ మోహన్ వెల్లడించారు. మే 9వ తేదీ ఉదయం 9 గంటలకు ఎస్.కోట నియోజకవర్గ పరిధి బలిఘట్టంలో 57.09 ఎకరాల్లో రూ.7.00 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక వాడకు మంత్రి శంకుస్థాపన చేస్తారని, తొలిదశలో ఇక్కడ 20 ఎకరాల్లో పార్కు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. 9వ తేదీ మధ్యాహ్నం 4 గంటలకు నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలో నెల్లిమర్ల ఎఫ్.ఎఫ్.సి.లో 15.55 ఎకరాల్లో రూ.15.55 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక వాడకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు.10వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కొండకిండాంలో 57.49 ఎకరాల్లో రూ.17.89 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న పారిశ్రామిక వాడకు, ఉదయం 11 గంటలకు బొబ్బిలి నియోజకవర్గ పరిధి కొట్టక్కిలో 10 ఎకరాల్లో రూ. 7 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న పార్కుకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

ఉపాధ్యాయ బదిలీలు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును బుధవారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు, పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు మిట్ట కృష్ణయ్య కలిశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, బదిలీలను ఎటువంటి ఇబ్బందులూ లేకుండా నిర్వహించాలని కోరారు.

పండగ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-సాలూరు

సాలూరులో ఈ నెల 18,19,20 తేదిల్లో జరిగే శ్యామలాంబ అమ్మవారి పండుగ ఏర్పాట్లను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి బుధవారం పరిశీలించారు. తొలుత శ్యామలాంబ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆలయం చుట్టూ చేపడుతున్న ఫ్లోరింగ్ వర్క్‌ను, పరిసరాలను పరిశీలించారు.

వ్యక్తి దారుణ హత్య

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని చామలాపల్లిలో బుధవారం దారుణ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన తొత్తడి ప్రసాద్‌పై అదే గ్రామానికి చెందిన నడుపూరి మురళి కత్తితో దాడి చేశాడు. దీంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇరు కుటుంబాల మధ్య తగాదాలు ఉన్నాయి. మురళి భార్య తన కన్నవారింటి వద్ద ఉంటోంది. అందుకు కారణం ప్రసాద్ అని అనుమానించిన మురళి పలుమార్లు ఆతడిని చంపుతానని బెదిరించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఒక శుభ కార్యానికి ట్రాక్టర్ డ్రైవర్ ప్రసాద్ ట్రాక్టర్‌పై సప్లయర్ సామాన్లు తీసుకొని వెళ్తుండగా గ్రామ శివారున మురళి కాపు కాసి ఉన్నాడు. సమీపంలోకి రాగానే కత్తితో నరికి చంపాడు. ఎస్ఐ నారాయణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

14లోపు వీధి విక్రయదారుల సర్వే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని వీధివిక్రయదారులను గుర్తించి కమిటీలను పునర్వ్యవస్థీకరించే కార్యక్రమం ఈనెల 14వ తేదీ లోపు పూర్తి చేయాలని కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎమినిటీస్, ప్లానింగ్ కార్యదర్శులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీధివిక్రయదారులను గుర్తించే సర్వే ప్రక్రియ శతశాతం పూర్తి చేయాలని కార్యదర్శులకు ఆదేశించారు. నగరంలో రెడ్, గ్రీన్, అంబర్ జోన్లను ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు. వీధివిక్రయదారులకు గుర్తింపు కార్డులను కూడా అందజేస్తామన్నారు. రెడ్ జోన్ లో వీధివిక్రయాలు పూర్తిగా నిషేధమని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, ఐవి రమణమూర్తి, టిపిఆర్ఒ సింహాచలం, టౌన్ సర్వేయర్ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

సచివాలయాల పరిశీలన

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సచివాలయ సిబ్బందికి నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు సూచించారు. బుధవారం 45, 46, 47 నెంబర్ల సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అయితే కొన్నిచోట్ల విజిటింగ్ పుస్తకాలు లేకపోవడంపై సిబ్బందిని మందలించారు. రిజిస్టర్ల నిర్వహణ సరిగా లేదని గుర్తించారు. ఈ విషయమై కార్యదర్శులకు తగు సూచనలు జారీ చేశారు. కొంతమంది విధులకు ఆలస్యంగా రావడానికి గమనించి మందలించారు. మెరుగైన పౌర సేవలు అందించడమే సచివాలయాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే దిశగా కార్యదర్శులకు సూచించామని చెప్పారు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారి చరిత్ర ఘట్టాల చిత్రమాలికను ఆవిష్కరిస్తున్న టివి వెంకటేష్, ఎమ్మెల్యేఅదితి

వైభవంగా వాసవి జయంతి

హాజరైన ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మాజీ ఎమ్‌పి టిజి వెంకటేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. అమ్మవారి దేవస్థానం వద్ద ప్రధాన అర్చకులు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఉదయం 4 గంటల నుండి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని బంగారు చీరలో వజ్రకిరీటంతో దేదీప్యమాణంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ నారాయణం శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మవారి జయంతి సందర్భంగా అనేక కార్యక్రమంలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటలకు అమ్మవారి చరిత్ర 25 ఘట్టాలను మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి.వెంకటేష్ ఆవిష్కరించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 102 రకాల పిండివంటలు అమ్మవారికి సారె సమర్పించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతోపులివేషాలు,కోలాటం సాంస్కతిక కార్యక్రమంల నడుమ అంగరంగ వైభవంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు, గౌరవాధ్యక్షులు కోలగట్ల వీరభద్రస్వామి, కాపుగంటి ప్రకాష్, పాలకమండలి సభ్యులు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, మురుగన్, విజ్జపు వెంకట శ్రీనివాసరావు, బుడ్డెపు వెంకటరావు, మామిడిపాక జగన్మోహన్ రావు, వెత్సా సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

విజయ సిందూర్ సైనికులారా సెల్యూట్

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసి ఉగ్రవాదులను మట్టుబెట్టి విజయం సాధించిన భారత సైనిక దళాలకు సెల్యూట్ అంటూ కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ జెసిరాజు ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌టిఆర్ కూడలిలో నినాదాలు చేశారు. జెసి రాజు మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడి భారతీయ పౌరులను తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయన్నారు. దేశ ప్రజలంతా ప్రభుత్వానికి, భద్రతా దళాలు అండగా ఉన్నారని అన్నారు. గెంబలి శ్రీనివాసరావు, ప్రవీణ్ కుమార్, రాజశేఖర్, పుల్లెల శ్రీను, శివకాంత్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రమూకల చర్యకు ప్రతిచర్య 'ఆపరేషన్ సిందూర్'

విజయనగరం : ఉగ్రమూకల చర్యకు ప్రతిచర్యే 'ఆపరేషన్ సిందూర్' అని రాష్ట సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.. పహల్గామ్ దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. భారత సాయుధ బలగాలు ఉగ్రవాద శిబిరాలపై మెరుపుదాడి చేసి గట్టి సమాధానమిచ్చాయని, తీవ్రవాదంపై భారత ఉక్కు సంకల్పానికి ఇది ఒక నిదర్శనమని వెల్లడించారు. పాకిస్తాన్‌పై భారత్ దాడులు ఆపరేషన్ సింధూర్‌పై వైసిపి జిల్లా అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. పహల్గాం ఉగ్ర దాడి ఘటనకు మన సైన్యం సరైన నిర్ణయం తీసుకుందని ప్రశంసించారు.

బొబ్బిలి : ఎన్‌టిఆర్ కూడలిలో నినాదాలు చేస్తున్న ప్రజలు

నిలిచిపోయిన రూ.21 కోట్ల సిఎఫ్‌ఎంఎస్ నిధులు

- బిల్లులను తిప్పిపంపిన ప్రభుత్వం
- డబ్బులు కోసం ఎదురు చూపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పాలక సంస్థలో కాంట్రాక్టర్లకు, అద్దె కార్ల వాహన దారులకు, కార్యాలయ నిర్వహణకు, విద్యుత్ బిల్లులు చెల్లింపునకు సిఎఫ్ఎంఎస్ ద్వారా రావాల్సిన రూ.21 కోట్లు నిధులు మార్చిల్లో రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. సుమారుగా గత ఏడాది సెప్టెంబర్ నుంచి కాంట్రాక్టర్లకు రావాల్సిన డబ్బులు రూ.14 కోట్లు, నగర పాలక సంస్థ కార్యాలయం లో అధికారులు తిరుగుతున్న 10 అద్దె కార్లకు నాలుగు నెలలు బిల్లులు, నగర పాలక సంస్థ కార్యాలయం కరెంట్ బిల్లు,నిర్వహణ ,వాటర్ సప్లై ఉద్యోగులు వేతనాలు,నిర్వహణ బిల్లులు మొత్తం కలిసి రూ.21 కోట్లు రావల్సి ఉంది. ఈ నిధులు సిఎఫ్ఎంఎస్‌లో ఫిబ్రవరి నాటికి నగర పాలక సంస్థ గణాంక విభాగం సిబ్బంది ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేశారు. మార్చి నెలాఖరు నాటికి అప్ లోడ్ చేసిన బిల్లులు మొత్తం రూ.21 కోట్లు వస్తాయని ఎదురుచూశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆ బిల్లులను రద్దు చేస్తూ చేదు కబురు పంపించింది దీంతో నవంబర్ నుంచి రావాల్సిన బిల్లులు సుమారుగా రూ.14 కోట్లు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి, వడ్డీకి డబ్బులు తెచ్చి నగర పాలక సంస్థలో అభివృద్ధి పనులు చేస్తే సెప్టెంబర్‌లో

బిల్లులు పెడితే ఇంత వరకు చెల్లించకపోతే ఎలా అని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 9 నెలల పాటు బిల్లులు చెల్లించకపోవడం వలన కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు చేసేందుకు వెనకంజ వేస్తున్నారు. మరో వైపు నగర పాలక సంస్థలో అధికార్లకు పది అద్దె కార్లు నడుస్తున్నాయి. అద్దె కార్లు వారికి డిసెంబర్ నుంచి బిల్లులు చెల్లించలేదు. సి ఎఫ్ఎంఎస్ ద్వారా పెట్టిన బిల్లులు ప్రభుత్వం రద్దు చేయడంతో అధికారులు స్పందించి ఇటీవల నగర పాలక సంస్థ ద్వారా కార్లు యజమానులకు నెల బిల్లులు చెల్లించారు. మరోవైపు సిఎఫ్ఎంఎస్ ద్వారా కార్యాలయ నిర్వహణకు, కరెంటు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇవి కూడా రద్దు చేయడంతో ఎప్పుడూ వస్తాయా అని ఎదురు చూస్తున్నారు.

అప్‌లోడ్ కు రాని ఆదేశాలు

ప్రభుత్వం మార్చి నెలలో సిఎఫ్ఎంఎస్ ద్వారా రావాల్సిన నిధులు రద్దు చేసింది. కానీ ఎప్పటికైనా ఆ నిధులు విడుదల చేయాల్సిందే. అయితే మార్చి ముగిసి ఏప్రిల్, మే నెలల్లోకి వచ్చేసాం కానీ ఇంతవరకు బిల్లుల కోసం ఆన్ లైన్‌లో మళ్లీ అప్ లోడ్ చేసేందుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. మరల ఆన్ లైన్లో అప్ లోడ్ చేస్తే తప్ప ఆ నిధులు వచ్చే పరిస్తితి లేదు. ప్రభుత్వం ఎప్పుడూ ఆన్ లైన్లో అప్ లోడ్ చేయాలని అదేస్తుందో, ఎప్పుడు డబ్బులు వస్తాయోనని ఎదురు చూడటం తప్ప మరో మార్గం లేదు. దీంతో ప్రభుత్వ ఆదేశాలు కోసం నగరపాలక సిబ్బంది ఎదురు చూస్తున్నారు.

అధికారులతో మాట్లాడుతున్న డిపిఒ వెంకటేశ్వరరావు

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం

జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - రామభద్రపురం

జిల్లాలో ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు ఆదేశించారు. రామభద్రపురం మేజరు పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో ఇళ్ల పన్నుల వసూళ్లు ఏ మేరకు జరిగాయి, బకాయిలపై ఆరా తీశారు. పారిశుధ్యం, స్వర్ణ పంచాయతీ అప్డేషన్లపై పంచాయతీ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. రామభద్రపురం మేజరు పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిద్దిడానికి అన్ని చర్యలూ తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వేసవి కాలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, అన్ని కాలనీల్లో తాగునీరు అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా మేజరు పంచాయతీ సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గుమస్తా పోస్టు ఖాళీగా ఉందని, మండల కేంద్రంలో 2 సచివాలయాలకు గ్రేడ్-5 సెక్రటరీలను నియమించాలని కోరారు.

విరివిగా మొక్కలు నాటుదాం

ప్రజాశక్తి - వేపాడ

పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలను నాటుదామని జియో వ్యవస్థాపకుడు బి. రామకృష్ణ అన్నారు. గ్రీన్ ఇయర్స్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రామస్వామి పేట క్వారీ సమీపంలో గల స్వయంభూ లింగాలయం ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రత తీవ్రతను తగ్గించడానికి పర్యావరణ రక్షణకు విరివిగా చెట్లను పెంచుదామన్నారు. ఈ కార్యక్రమంలో సిమ్ డైరెక్టర్ వై విజయలక్ష్మి, ఏ ప్రభాస్, బి. హృషీకేశ్, లాస్యశ్రీ ఆలయ కమిటీ సభ్యులు వల్లంశెట్టి శ్రీనాథ్, వి.హరి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగమాధవి

సిసి రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో సిసి రోడ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే లోకం నాగమాదవి బుధవారం ప్రారంభించారు. 1వ వార్డులో చేపట్టనున్న పనులకు ఆమె భూమి పూజ చేశారు. అనంతరం ఆమె నెల్లిమర్లలో వాసవి మత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ, కమిషనర్ ఎ.తారక్ నాథ్, వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, కౌన్సిలర్ కె. కళావతి, జనసేన నాయకులు బంగారు శంకర రావు, ఎంఎం నాయుడు, పాండ్రంకి సత్యనారాయణ, రవ్వా నాని తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందేలా చర్యలు

ప్రజాశక్తి - బొబ్బిలి

వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీరు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే బేబినాయన ఆదేశించారు. స్థానిక కోటలో బుధవారం ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వెంగళరాయ సాగర్ నీరు పిరిడి సీతారాం సాగర్ చెరువు, అలజంగి దాలిందోర చెరువుకు వెళ్లేలా చూడాలన్నారు. విఆర్ఎస్ కాలువలు ద్వారా సాగునీరు అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కాలువలకు అవసరమయ్యే నిధులు మంజూరు అయ్యేలా చూస్తానని చెప్పారు. సాగునీరు కోసం రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

సిఎంను కలిసిన నాగార్జున

ప్రజాశక్తి -చీపురుపల్లి

సిఎం చంద్రబాబును విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం టిడిపి అద్యక్షుడు కిమిడి నాగార్జున బుధవారం కలిశారు. ఈ సందర్భంగా తనకు ఉమ్మడి విజయనగరం జిల్లా సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ పదవి ఇచ్చినందుకు నాగార్జున చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలను తెలిపారు. అనంతరం జిల్లాలో ఉన్న రాజకీయ పరిస్థితులు పట్ల చంద్రబాబునాయుడు నాగార్జునుని అడిగి తెలుసుకునట్లు సమాచారం. జిల్లాలో ఉన్న ప్రజా ప్రతినిధులను, అధికారులను కలుపుకొని వెళ్లాలని చంద్రబాబునాయుడు నాగార్జునకి సూచించినట్లు నాగార్జున కార్యాలయం తెలిపింది.

సిఎం చంద్రబాబుతో నాగార్జున

బేబినాయన ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - బాడంగి

పేద అమ్మాయిలు వివాహానికి ఎమ్మెల్యే బేబినాయన ఆర్థిక సహాయం చేశారు. బాడంగికి చెందిన రాయల అప్పన్న, అంపావల్లి తాతబాబు కుమార్తెలకు వివాహం చేస్తున్నారు. రెండు కుటుంబాల ఆర్థికంగా ఇబ్బందులు పడడంతో ఒకొక్క కుటుంబానికి ఎమ్మెల్యే బేబీనాయన రూ.7,500 చొప్పున ఆర్థిక సహాయం చేశారు. నగదును సర్పంచ్ కండి రమేష్, బుధవారం ఈ కుటుంబాలకు అందించారు. బేబినాయనకు ఆయా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్లలో 3 నెలల వ్యవధిలో వివిధ కోర్సులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఇందుకోసం ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో నియోజకవర్గంలో 120 మంది చొప్పున నాలుగు నియోజకవర్గాల్లో 480 మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఉచిత శిక్షణ పొందేందుకు కనీసం పదో తరగతి విద్యార్హత తప్పనిసరని, అర్హత, ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నియోజకవర్గాల వారీ శిక్షణ ఇచ్చే ప్రదేశాలు, కార్యక్రమాల వివరాలు

పార్వతీపురం నియోజకవర్గంలో ఎం.ఆర్.నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ వాయిస్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులపై శిక్షణ ఇస్తారు. ఇతర వివరాలకు 91772 97528 నంబరును సంప్రదించాలి.

సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- రాజాం

నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20వ తేదీన జరగబోయే సమ్మెలో అందరూ పాల్గొవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రాజెక్ట్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ చందుకు అంగన్‌వాడీలతో కలిసి ఆయన సమ్మె నోటీస్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక కోడ్లు రద్దు, అంగన్ వాడీ సమస్యల పరిష్కారానికై అఖిల భారత కేంద్ర కార్మిక సంఘాలు, ఎవిఎఫ్‌డబ్ల్యుహెచ్, స్వతంత్ర ఫెడరేషన్ల పిలుపు మేరకు మే 20వ తేదీన జరగబోయే సమ్మెలో మన రాష్ట్రంలోని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్స్ అందరూ పాల్గొనాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మికవర్గం పై బానిసత్వాన్ని రుద్దటానికి 29 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్స్‌ను తెచ్చిందన్నారు. దీన్ని తిప్పి కొట్టడానికే ఈ సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఐసిడిఎస్ బడ్జెట్ పెంచాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ జిఒ 8ని మార్పుచేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇవ్వాలన్నారు. అనంతరం సమ్మెకు సంబంధించిన బుక్‌లెట్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, ప్రాజెక్ట్ అధ్యక్షులు హెచ్.రూపవతి, ఎల్ జయలక్ష్మి, వనజాక్షి, సుజాత, ప్రమీల, రాంబాయి, దమయంతి, నిర్మల, కుమారి, చిన్నతల్లి, మేరి, తదితరులు పాల్గొన్నారు.

రాజాం: సమ్మె నోటీసు ఇస్తున్న సిఐటియు నాయకులు

కొత్తవలస: సదస్సులో మాట్లాడుతున్న రవికుమార్

కొత్తవలస: పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను భంగం కలిగించే విధంగా బిజెపి మార్పు చేస్తుందని మెడికల్ రిప్రజెంట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. రవికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి కార్మికులపై దాడి జరుగుతోందన్నారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను సమూలంగా మార్చి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులు సంఘం పెట్టుకునే హక్కును కూడా తీసేస్తున్నారన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ పద్ధతుల్లో పనిచేసే వారిని పర్మినెంట్ చేయాలన్నారు. రైతన్న పండించే పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు వ్యవసాయ రంగంలో వాడుతున్న వాహనాల విడిభాగాలు సబ్సిడీ రేటుకి ఇవ్వాలన్నారు. వీటన్నింటిపై మే 20వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దెల రమణ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు జెవి ప్రసాద్, కె.తులసి, పి.శారద, టి. రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం ఇవ్వాలి

పూసపాటిరేగ: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో ఎంపిడిఒ రాధికకు వినతి అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు బచ్చల సూర్యనారాయణ మాట్లాడుతూ మ్యాండిస్ విధానం రద్దు చేయాలని, లేబర్ కోడ్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ ఇవ్వాలని, అందరికీ ఎఫ్‌డిఎఫ్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మే 20వ తేదీన జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెకు నోటీస్ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కే రాజేష్, విఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: ఎంపిడిఒకు సమ్మె నోటీసు అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కార్మికులకు చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి -విజయనగరం లీగల్

అసంఘటితరంగ కార్మికులు తమ హక్కులు, చట్టాలు గురించి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణప్రసాద్ తెలిపారు. మేడే వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం న్యాయ సేవా సదన్‌లో అసంఘటిత రంగ కార్మికులతో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ జి. దుర్గయ్య, కృష్ణప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ యాజమాన్యాలు కనీస సౌకర్యాలు కల్పిస్తున్నాయా లేదా, అడిగారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయం గురించి వివరించారు. ఏ విధమైన న్యాయం అవసరమున్నా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని తెలియజేశారు. దుర్గయ్య మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ 2015లో అసంఘటిత భవన కార్మికులకు ఏర్పాటు చేసిన పథకం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ కార్మిక శాఖలో రిజిస్టర్ చేయించుకొని ఈ శ్రమ కార్డులను పొందాలని తెలిపారు. న్యాయ సేవా అధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 15100కి ఫోన్ చేసి న్యాయ సలహాలను పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి నైమిష

కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలి

రాజాం : కార్మిక చట్టాలు, హక్కులపై అవగాహన ఉండాలని సివిల్ జడ్జి కె.నైమిష అన్నారు. మండల న్యాయ సేవా సంస్థ అధ్వర్యంలో పట్టణం లోని కేశవ జూట్ మిల్స్ లో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వారోత్సవాలలో భాగంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక చట్టాలు, భద్రతా చర్యలు అనే అంశాలపై వివరించారు. కార్మికులు వారిహక్కులకు భంగం వాటిల్లినట్లయితే న్యాయస్థానాలను ఆశ్రయించాలని కోరారు.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

విజయనగరం: మాట్లాడుతున్న ఎ. కృష్ణప్రసాద్

సహాయ కార్మిక అధికారి బి.కొండలరావు మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ శ్రమ్ పోర్టల్లో నమోదైన అసంఘటిత కార్మికులు ప్రమాదాలు సంభవించినపుడు టోల్ ఫ్రీ నెంబరు 14434కు ఫోన్ చేసి సహాయాన్ని పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎన్. మురళీధర్, సీనియర్ న్యాయవాదులు, ఆర్. విజయ్ కుమార్, ఎం. శ్రీనివాసరావు, టౌన్ ఎఎస్ఐ కె.వి.రమణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: పుస్తకాలు చదువుతున్న పిల్లలు

విద్యార్థులకు నీతి కథలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా కవిత్రి కటకం, పావని రామాయణ, మహాభారత మొదలగు నీతి కథలను చెప్పారు. విద్యార్థులు డ్రాయింగ్ వేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 40 విద్యార్థులు పాల్గొన్నారని శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ తెలిపారు.

డెంకాడ: శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరానికి 20 మంది విద్యార్థులు హాజరై కథలు పుస్తకాలు చదివారు. అనంతరం క్యారమ్ బోర్డ్ ఆడి, పేపర్ క్రాఫ్ట్ చేశారని గ్రంథాలయాధికారి మహేష్ తెలిపారు.

డైట్ లెక్చరర్‌గా అప్పారావు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీ జరజాపుపేటకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కాళ్ల అప్పారావు ఇక్కడి వేణుగోపాలపురంలోని ప్రభుత్వ డైట్ కళాశాల లెక్చరర్ గా (తెలుగు) ఎంపికయ్యారు. అప్పారావు ప్రస్తుతం మండలంలోని మొయిద విజయరాంపురం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. 2012 డిఎస్‌సి లో ఉపాధ్యాయుడిగా ఎంపికయిన అప్పారావు తొలుత మెరకముడిదాం మండలంభైరిపురం ఉన్నత పాఠశాలలో చేరారు. ఆ తర్వాత కొద్ది కాలం గరివిడి మండలం కోనూరు పాఠశాలలో పనిచేసి అక్కడ నుంచి మొయిద విజయరాంపురం బదిలీపై వచ్చారు. డైట్ లెక్చరర్ పోస్టుకు ఇటీవల నిర్వహించిన పరీక్షలో మంచి మార్కులు సాధించి లెక్చరర్ గా ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సుమారు మూడేళ్లకు పైగా డిప్యుటేషన్‌పై డైట్ లెక్చరర్ గా కొనసాగనున్నారు.

సిరిమాను చెట్టుకు ఎమ్మెల్యే పూజలు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని అక్కివరంలో ఈనెల 12,13,14 తేదీల్లో జరిగే పైడితల్లమ్మ పండగ సిరిమాను కోసం సిద్ధం చేసిన చెట్టుకు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి బుధవారం పూజలు నిర్వహించి చెట్టును కొట్టారు. గ్రామంలో ప్రజలందరూ చెట్టుకు పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సిరిమాను చెట్టు కోసం గ్రామంలోని అప్పలనాయుడు కళ్ళంలోని ఉన్న చెట్టును గుర్తించి పూజారి కంది వెంకటరమణ ఆధ్వర్యంలో చెట్టు తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామంలో ఇలాంటి పండగ సుమారు 120 సంవత్సరాల తరువాత చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ పండగకు గ్రామస్తులు సుమారు కోటి రూపాయలు వరకు ఖర్చు పెడుతున్నారు. పైడితల్లమ్మ ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాటు చేశారు. చెట్టు తొలగించిన తరువాత ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు మాజీ జెడ్‌పిటిసి కంది సూర్యనారాయణ, ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైసిపి నాయకులు పిన్నింటి తమ్మునాయుడు, టిడిపి మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, సర్పంచ్ కంది కిరణ్‌కుమార్, పానీరాజు, మహంతి చిన్నమనాయుడు, సువ్వాడ రవి శేఖర్, కాగితాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

శిథిల భవనాలను కూల్చేయండి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని గుడివాడ, చలుమూరు వారిపాలెం, దుర్గ పేట గ్రామాలలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాలల భవనాలను ఎటువంటి ప్రమాదం జరగకముందే కూల్చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పూర్తిగా శిథిలావస్థకు చేరిన ఈ భవనాల్లో ఆయా గ్రామాల రైతులు పశువులకు నిలయంగా ఉపయోగించుకుంటున్నారు. ఈ భవనాలు పూర్తిగా శిథిలమవడంతో ఎప్పుడు కూలిపోయి ఎవరికి ప్రమాదం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి ఈ శిథిల భవనాలను కూల్చేయాలని ప్రజలు కోరుతున్నారు

శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

స్టాక్ పాయింట్ పరిశీలన

ప్రజాశక్తి-మెరకముడిదాం

స్థానిక జెడ్‌పి హైస్కూలులో విద్యార్థి మిత్ర స్టూడెంట్స్ కిట్స్ స్టాక్ పాయింట్‌ను జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు సిఎంఒ వి. ఆదినారాయణ, అసిస్టెంట్ సిఎంఒ ఎ.రామారావు బుధవారం పరిశీలించారు. ఇంతవరకు వచ్చిన పాఠ్య పుస్తకాలు అదే విధముగా నోట్ పుస్తకాలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు ప్రణాళిక ప్రకారం స్టూడెంట్ కిట్స్ పరికరాలు వారిగా ఏర్పాట్లు బాగా చేశారని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎం. చంద్రశేఖర్, టి. ధర్మ శ్రీను, సిఆర్‌ఎంటిలు, ఎంఆర్ సి సిబ్బంది, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి మాత జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

శ్రీ వాసవి మాత అమ్మవారి జన్మదినోత్సవ వేడుకలు ఎస్.కోట ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి సుప్రభాత సేవ, అలంకరణ, ఊరేగింపు ఉత్సవం, అభిషేక సేవలు, కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వేణుగోపాల స్వామి ఆలయం నుండి దేవితల్లి అమ్మవారి ఆలయం వరకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మేళ తాళాలతో, సాంప్రదాయ పద్ధతులతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు హెచ్ నానాజీ, వర్తక సంఘ ఉపాధ్యక్షులు కొల్ల వెంకటేష్, వాసవి క్లబ్ మెగా అధ్యక్షులు పి అప్పారావు, వాసవి క్లబ్ యూత్ అధ్యక్షులు యు.విజయకుమార్, ఆర్యవైశ్య యువజన సంఘం సహాయ కార్యదర్శి బాలనాగు, శ్రీనివాస్, జోన్ ఛైర్మన్ ఎం. శివకుమార్, రీజనల్ సెక్రటరీ ఆదిమూలం హరీష్ కుమార్, పూర్వాధ్యక్షులు వేమూరి శ్రీనివాస్, జిల్లా ఆఫీసర్ ఆదిమూలం రత్నావతి, సంఘ ప్రముఖులు మద్దుల శ్రీనివాసరావు, తోట సినయ్య, తోట వాసు, ఉప్పల నర్సింగరావు, ఆదిమూలం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

ప్రజాశక్తి - బొబ్బిలి

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఎమ్మెల్యే బేబినాయన ఘనంగా నివాళులర్పించారు. స్థానిక కోటలో బుధవారం అల్లూరి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజనులు హక్కుల కోసం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని బేబినాయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిఆర్ కాలనీలో వర్ధంతి

స్థానిక టిఆర్ కాలనీలో వనమిత్ర అధ్యక్షులు కె.కృష్ణదాసు అల్లూరి సీతారామరాజు వర్ధంతి నిర్వహించి అల్లూరి జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. గిరిజనులు పక్షాన అల్లూరి పని చేశారన్నారు.

బొబ్బిలి: అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

కొత్తవలస:అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

కొత్తవలస: తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అల్లూరి పార్క్ వద్ద అల్లూరి విగ్రహానికి తహశీల్దార్ నీలకంఠరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పేద మహిళకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు ఎం.గోపిరాజు, సిరివూరి గణేశ్వర రాజు, డిప్యూటీ తహశీల్దార్ సునీత, ఇఒపిఆర్‌డి శ్రీదేవి, విఆర్‌ఒలు, క్షత్రియ సేవాసమితి సభ్యులు కమ్మెల్ల నాని బాబు రాజు, ముదునూరు గోపిరాజు, పిఎస్ వర్మ, ముదునూరి వర్మ, కమ్మెళ హరిరాజు, శ్రీనురాజు, గొట్టుముక్కల వరహాలరాజు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కొండగుంపాంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి సిపిఐ నాయకులు మొయిద పాపారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పి.సూర్య, తవిటినాయుడు, రాముునాయుడు, సూర్యారావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: అల్లూరి సీతారామరాజు వర్ధంతిని క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ముందున ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సేవా సంఘం ప్రతినిధులు జగన్నాథరాజు, సీతారామరాజు, వెంకటరమణరాజు, జుజ్జూరు శివశంకరవర్మ, పాకలపాటి తిరుపతిరాజు, సాంభరాజు, బుజ్జి, శ్రీనురాజు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

దాడితల్లి సిరిమానోత్సవంలో అపశృతి

రథం కింద పడి యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - బొబ్బిలి

గొల్లపల్లి దాడితల్లి సిరిమానోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. స్థానిక జెండామాల్ జంక్షల్లో మంగళవారం రాత్రి 11.15 గంటల సమయంలో మీగడవీధికి చెందిన అంటిపేట జయరాం పైనుంచి రథం చక్రం వెళ్లడంతో కాలు విరిగిపోయింది. తీవ్రంగా గాయపడిన జయరాంను పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని చామలపల్లి మాజీ సర్పంచ్ కుంచి భారతమ్మ(65) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు ప్రగాఢ సంతాపం తెలిపారు.